

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.34 గం..
సహర్ : ఆదివారం ఉ : 4.55 గం..



ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ అక్రమాలు, వివాదాలకు కేరాఫ్‌గా మారిందా? యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు, నిధుల కేటాయింపులు జరుగుతున్నాయా? అడ్మిషన్లు మొదలు విద్యార్థుల ఆన్సర్ షీట్ల స్కానింగ్ టెండర్ల రద్దు వరకు అన్నీ అక్రమార్కుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయా? వీసీ, రిజిస్ట్రార్ నియామకంతో పాటు 16 మంది అనుబంధ అధ్యాపకుల కొలువుల దాకా అన్నిటిలోనూ ఆరోపణలకు కేంద్రంగా విశ్వవిద్యాలయం మారిందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. యూనివర్సిటీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం దృష్టిసారించకపోవటంతో విద్యా ప్రమాణాలతో పాటు వర్సిటీ కీర్తిప్రతిష్టలు కూడా దెబ్బతింటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అక్రమాలకు కేరాఫ్ కేయూ!




ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ

- గాడి తప్పిన పాలనతో అంతా అస్తవ్యస్తం
- అనుబంధ అధ్యాపకుల నియామకం, ఆన్సర్‌షీట్ల స్కానింగ్ టెండర్లలో గోల్‌మాల్
- ఫార్మసీ కళాశాలలకు అనుమతుల్లోనూ నిబంధనలకు చెల్లుచీటీ
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విద్యార్థుల ఆందోళన
- సీడ్‌మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులతో నిధులు స్వాహా
- రిజిస్ట్రార్‌తో సహా అనేక నియామకాలపై వివాదం

'రెవెన్యూ'లో అవినీతి జలగలు!

ధరణి పేరిట అక్రమ వసూళ్లు

- బయటపడుతున్న అధికారుల లంచాల బాగోతం
- రైతు ఆత్మహత్యతో శాఖ పనితీరుపై విమర్శలు



జనగామ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో అవినీతి జలగలు రాజ్యమేలుతున్నాయి. భూ రికార్డుల్లో మార్పులు, చేర్పుల క్రమంలో కొందరు ఉద్యోగులు తీరు ఆడిందే ఆటగా సాగుతోంది. 'ధరణి'లో లోపాలను ఆసరాగా చేసుకుని సమస్య పరిష్కారం పేరిట విచ్చలవిడిగా లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన శివలింగయ్య హయాంలో 'ధరణి' పేరుతో పెద్ద ఎత్తున వసూళ్ల పర్వం కొనసాగిందనే విమర్శలు ఉండగా.. నాడు ఆయనకు సన్నిహితంగా ఉన్న కొందరు ఉద్యోగులు ఒక్కో ఫైల్‌కు ఒక్కో రేట్ కట్టి వసూళ్లు చేశారన్న ఆరోపణలు వినిపించాయి. అవినీతి ఆరోపణలతోనే ఏకంగా కలెక్టరే బదిలీ కావడం చర్చనీయాంశమైంది. అయితే కొత్త కలెక్టర్‌గా షేక్ రిజ్వాన్ భాషా బాధ్యతలు తీసుకున్న తర్వాత కూడా కొందరు ఉద్యోగులు అదే తంతు కొనసాగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. తమ భూమిని లంచం తీసుకొని ఇతరులకు పట్టా చేశారని ఆరోపిస్తూ ఇటీవల జనగామ నాయబ్ తహసీల్దార్‌పై కొందరు దాడి చేసిన సంగతి తెలిసిందే. అది మరువక ముందే డబ్బులు తీసుకొని కూడా పట్టా మార్పిడి చేయలేదంటూ బచ్చన్నపేట మండలం పడమటికేశవాపూర్‌కు చెందిన ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడడం సంచలనంగా మారింది. కాగా.. ఈ రెండు ఘటనలతో జనగామ జిల్లా రెవెన్యూ శాఖలో జరుగుతన్న అవినీతి దందాను తేటతెల్లం చేస్తోంది.

'ధరణి'తో కాసుల పంట!

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ కొందరికి కాసుల పంటగా మారింది. ధరణి రాకతో పెద్ద సంఖ్యలో భూముల వివరాలు తారుమారయ్యాయి. దీంతో వాటిని సవరించుకునేందుకు దరఖాస్తులు కూడా వెల్లువెత్తాయి. గతంలో భూ రికార్డుల క్లియరెన్స్ తహసీల్దార్, ఆర్డీవో చేతిలో ఉండగా ధరణి వచ్చాక కలెక్టర్ చేతుల్లోకి ఆ అధికారం వెళ్లింది. రికార్డుల చేర్పులు, మార్పులకు గానూ గతంలోనూ రెవెన్యూ సిబ్బంది లంచాలకు దిగగా ధరణి తర్వాత పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కింది స్థాయి నుంచి కలెక్టర్ స్థాయి వరకు ముట్టజెప్పాలనే సాకుతో ఒక్కో ఫైల్‌కు ఇంత అని, ఎకరాకు ఇంత అని లెక్కగట్టి మరీ డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గడిచిన రెండేళ్లలో ఈ తతంగం పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తోంది.

బహిరంగంగా విమర్శలు

రెవెన్యూ శాఖలో లంచాల బాగోతంపై తాజాగా బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. కొందరు అధికారులు ఇతరుల వద్ద డబ్బులు తీసుకొని అర్హులకు అన్యాయం చేయడం, కొందరు డబ్బులు తీసుకొని న్యాయం చేయకపోవడం వంటి ఆరోపణలు బయటపడుతున్నాయి. ఇటీవల జనగా మ నాయబ్ తహసీల్దార్ జగన్‌పై పలు వురు దాడి చేశారు. తమకు చెందాల్సిన భూమిని రూ.4 లక్షల లంచం తీసుకొని ఒరిజినల్ పాసు పుస్తకం లేకుండానే ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారంటూ నాయబ్ తహసీల్దార్ జగన్‌పై తహసీల్దార్ కార్యాలయంలోనే ఈ నెల 15న ఏకంగా దాడి జరిగింది. ఈ దాడి ఘటనలో 13 మందిపై కేసు నమోదు అయింది. ఈ ఘటన మరువక ముందే బచ్చన్నపేట మండలం పడమటికేశవాపూర్‌కు చెందిన రైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. తాము ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని రికార్డుల్లోకి ఎక్కించడం కోసం సీనియర్ అసిస్టెంట్ సుమన్‌కు తన భర్త గత ఏడాది ఫిబ్రవరిలో రూ.4.50 లక్షలు లంచంగా ఇచ్చారని, భూమి రికార్డుల్లోకి ఎక్కించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య శ్యామల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తే వెలుగులోకి మరిన్ని..

ధరణికి సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తే దాని వెనుక జరుగుతున్న అవినీతి బాగోతాలు మరిన్న బయట పడే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం 15 నుంచి 30 రోజుల్లోగా ధరణి ఫైళ్లకు క్లియరెన్స్ జరగాలి. డబ్బులు ముట్టని ఫైళ్లను ఉద్దేశపూర్వకంగానే పెండింగ్‌లో పెడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అవినీతి ఆరోపణలతో గత కలెక్టర్ శివలింగయ్య బదిలీ కాగా, ఆయన స్థానంలో షేక్ రిజ్వాన్ భాషా వచ్చారు. వచ్చీ రావడంతోనే కలెక్టరేట్ క్యాంపు, కలెక్టర్ పేషీలోని ఉద్యోగులకు స్థానచలనం కల్పించారు. గత కలెక్టర్‌కు సన్నిహితంగా ఉంటూ అవినీతి ఆరోపణలు వచ్చిన ఉద్యోగులను ఇతర మండలాలకు, విభాగాలకు బదిలీ చేశారు. దీంతో కలెక్టరేట్‌లోని పలువురి అవినీతి ఉద్యోగుల్లో భయం పట్టుకుంది. ఇదే విధంగా జిల్లా రెవెన్యూ శాఖ పనితీరుపై దృష్టి పెట్టి పరిస్థితిని గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. కాగా, జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి ఫైళ్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల కాసుల కక్కుర్తికి రైతు బలవన్మరణం

- రూ.4.50 లక్షల లంచమిచ్చినా తీరని 'సవరణ' సమస్య
- ఏడాది తర్వాత చేతులెత్తిన సీనియర్ అసిస్టెంట్
- రైతు మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన


రఘుపతి మృతదేహం

బచ్చన్నపేట, మార్చి 22 : భూమి తన ఆధీనంలోనే ఉన్నా.. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం తన పేరు లేకపోవడంతో సవరణ కోసం అధికారులకు లంచం ఇచ్చినా సమస్యను పరిష్కరించకపోవడంతో మనస్తాపం చెందినబచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన కొమ్మాట రఘుపతి(45) అనే రైతు శుక్రవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొలిపాక సుమన్‌తో పాటు, సర్వేయర్ రవీందర్ నిర్వాకం మూలంగానే తన భర్త మృతి చెందాడని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో భార్య శ్యామల ఆరోపణలు చేసింది. రఘుపతి భార్య ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం... తన భర్త రఘుపతికి బచ్చన్నపేట మండలం కొన్నె రెవెన్యూ శివారులోని 75, 76 సర్వేనంబర్‌లలో కొంత వ్యవసాయ భూమి ఉందని తెలిపింది. 1.20 ఎకరాలు ఆధీనంలోనే ఉన్నప్పటికి రికార్డుల్లో మాత్రం పేరు నమోదై లేకపోవటంతో పలుమార్లు తన భర్త రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడని చెప్పింది. ఫలితం లేకపోవడంతో రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న రవీందర్ సహకారంతో గతేడాది ఫిబ్రవరిలో సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్‌కు రూ.4.50 లక్షలు లంచంగా ఇచ్చాడని రఘుపతి భార్య ఫిర్యాదులో పేర్కొంది. అప్పటి నుంచి కార్యాలయం చుట్టూ తిరిగినా, రికార్డులో నమోదుకు కాలయాపన చేస్తుండటంతో తన భర్త తీవ్ర మానసిక క్షోభ అనుభవించాడన్నారు. గురువారం సుమన్‌ను గట్టిగా నిలదీస్తే రికార్డులో నమోదు చేయటం కుదరటం లేదని బదులిచ్చాడని, డబ్బుల గురించి ప్రశ్నిస్తే పట్టించుకోలేదని తెలిపింది. డబ్బులు ఇవ్వకపోవటం, రికార్డుల్లో పేరు నమోదు కాకపోవటంతో మనోవేదనకు గురై ఇంటికి వచ్చాడని తెలిపింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి కొన్నె గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన తన భర్త ఉరేసుకుని చనిపోయాడని పేర్కొంది. తన భర్త చావుకు కారణమైన సుమన్, రవీందర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే రఘుపతి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు, గ్రామస్థులు, సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు.

కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని భీష్మించారు. దీంతో తహసీల్దార్ విశాలాక్షి స్థానిక ఎస్ఐ సతీష్‌తో కలిసి ఆందోళన కారులను శాంతింపజేసేందుకు పలుమార్లు ప్రయత్నించి.. చివరకు మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని, సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్‌లపై చర్య లు తీసుకుంటామని, డబ్బులను తిరిగి ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు రఘుపతికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.


ఆందోళన చేస్తున్న మృతుడు రఘుపతి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ


సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

మానుకోటలో ఏసీబీ కలకలం

లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా

స్థలం రిజిస్ట్రేషన్‌కు చదరపు గజానికి రూ.200 అదనంగా డిమాండ్

గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

సబ్‌రిజిస్ట్రార్‌కు సహకరించిన డేటాఎంట్రీ ఆపరేటర్ కూడా అదుపులోకి

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలో ఏసీబీ దాడులు కలకలం రేపాయి. బాధితుడిచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం కాపుకాసి.. జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెకు సహకరించిన ఔట్‌సోర్సింగ్ డేటాఎంట్రీ ఆపరేటర్ ఆలేటి వెంకట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన ప్రకారం.. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన రైతు గుండగాని హరీష్ దంతాలపల్లి మండల కేంద్రంలో 128 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల మొదటి వారంలో సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం ఫీజు కింద చదరపు గజానికి రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉండగా.. అదనంగా గజానికి రూ.200 ఇవ్వాలని సబ్‌రిజిస్ట్రార్ ఆయన్ను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గజానికి రూ.150 అదనంగా ఇచ్చేందుకు హరీష్ అంగీకరించాడు. కానీ అందుకు సబ్‌రిజిస్ట్రార్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు గజానికి రూ.200 చొప్పున ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో గత్యంతర లేని పరిస్థితుల్లో బాధితుడు వరంగల్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం మరోసారి సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడిన హరీష్.. తాను గజానికి రూ.150 చొప్పున 128 గజాలకు రూ.19,200 అదనంగా చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని, డబ్బు తెచ్చానని చెప్పగా.. ఆ నగదును డేటాఎంట్రీ ఆపరేటర్ వెంకట్‌కు అందించాలని తస్లీమా సూచించారు. ఆమె చెప్పినట్టుగా నగదును ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, డేటాఎంట్రీ ఆపరేటర్ వెంకట్ అలియాస్ ఆలేటి వెంకటేశ్వర్లుకు ఇస్తుండగా మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి హరీష్ ఇచ్చిన రూ.19,200తో పాటు అంతకుముందు శుక్రవారం రోజంతా ఇతరుల నుంచి లంచాల రూపంలో వసూలు చేసిన (అన్‌అకౌంట్ మనీ) రూ.1.72 లక్షలను కూడా స్వాధీనం చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌తో పాటు ఆమెకు సహకరించిన వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. వారిని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు శ్యాంసుందర్, సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు. మొత్తంగా ఏసీబీ దాడుల్లో తస్లీమా పట్టుబటడం జిల్లా వ్యాప్తంగా, అధికార వర్గాల్లో తీవ్ర కలవరం రేపింది. అయితే తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో దంతాలపల్లి మండల కేంద్రంలో ఇటీవలే 128 గజాల ఇంటి స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ప్రభుత్వానికి చెల్లించే ఫీజుతో పాటు అదనంగా డబ్బులు అడగడంతో ఏసీబీని ఆశ్రయించానని హరీష్ తెలిపారు. మరెవరికి ఇలా జరుగవద్దనే ధైర్యం చేశానన్నారు.

సామాజిక సేవా కార్యకర్తగా..

కొన్నేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ములుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాలం నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విపత్కర సమయాల్లో గిరిజనులకు సాయమందించడంలో ముందుండేవారన్న పేరుంది. కొవిడ్ విపత్కర సమయంలో ములుగు ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి కొండలు, గుట్టలు దాటి గిరిజన గూడేల్లోకి వెళ్లి నిత్యావసరాల పంపిణీతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇలా సామాజిక సేవాగుణం ఉన్న ఆమె లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

'ఓటు హక్కు వినియోగించుకోవాలి'


బాలికల జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ కల్చరల్, మార్చి 22: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ కోరారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బూత్ లెవల్ స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఓటు హక్కు మాత్రమే కాదని, అది ఒక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరో 20 మందికి ఓటుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు, ఆశాలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో కొమురయ్య, డీఏవో వినోద్‌కుమార్, డీఈవో రాము, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీటీ జగన్, తహసీల్దార్ వెంకన్న పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

నర్మెట, మార్చి 22 : కేంద్రంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. నర్మెట మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని వదిలి కాంగ్రెస్, బీఆర్ఎస్ ములాఖత్ రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్ఎన్ రెడ్డి, సిరికొండ విద్యాసాగర్‌రెడ్డి, ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు చౌడ రమేష్, శివరాజ్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సొక్కం అనిల్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరాయ ఎల్లయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రామకోటి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోలు రాజు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జంగిటి నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి..

తరిగొప్పుల : పార్టీలకు అతీతంగా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. తరిగొప్పుల మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించి ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో లేని పార్టీ బీఆర్ఎస్ అని.. గల్లీలో లేని పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. రెండు పార్టీల కుటుంబ పాలనను అంతమొందించేందుకు ప్రజలు కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి భువనగిరి ఖిల్లాపై బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, పార్లమెంట్ కన్వీనర్ కొంతం శ్రీనివాస్, అసెంబ్లీ ఇన్‌చార్జి బల్ల శ్రీనివాస్, సౌడ రమేష్, కొన్నె రాజు, బండ ప్రసాద్, ఎడెల్లి రాంనర్సింహ్మారెడ్డి, రాంబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.


నర్మెటలో ప్రచారం నిర్వహిస్తున్న బూర నర్సయ్యగౌడ్

ప్రజలు మోదీని కోరుకుంటున్నారు..

బచ్చన్నపేట : దేశ ప్రజలు ప్రధానిగా మళ్లీ నరేంద్రమోదీ ఉండాలని కోరుకుంటున్నారని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని లిమ్రా గార్డెన్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ మండల నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ పటంలో భారతదేశం ప్రత్యేకత సాధించటానికి మోదీ చేసిన కృషియే కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. బచ్చన్నపేటలోని పలు ఇళ్లకు వెళ్లి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఓటు అభ్యర్థించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ నయీంనగర్‌కు చెందిన సంద్ర దిలీప్ అనే యువకుడు (25) ఈ నెల 18న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా అదృశ్యమైపోయాడని హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేసే దిలీప్.. ఈ నెల 18న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఇళ్లలో వెతికినా సమాచారం లేకపోవడంతో దిలీప్ తల్లి శోభ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఐనవోలు, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పున్నేలు శివారు జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పంథిని గ్రామానికి చెందిన నస్కూరి వినోద్ ఐనవోలుకు వెళ్లి బైక్‌పై పంథినికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఏకశిల పాఠశాల సమీపంలో టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.



కటాక్షపూర్‌లోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, మార్చి22: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును సీపీ పరిశీలించారు. తనిఖీ సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సీపీతో ఆత్మకూరు సీఐ క్రాంతికుమార్ ఉన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 22: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించారు. తిరిగి మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్లో తగ్గిన పంటల ధరలు

వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో వివిధ పంట సరకులకు గురువారంతో పోలిస్తే శుక్రవారం మరింత తగ్గాయి. పత్తి క్వింటాకు రూ.7,315 శుక్రవారం రూ. 7,250 పలికింది. సింగిల్‌పట్టి మిర్చి క్వింటాకు రూ.45,600 లకు రూ.42వేలు పలికింది. తేజా రూ.19,800లకు రూ.19,300, వండర్‌హాట్ రూ.15,500లకు రూ.15వేలు, యుఎస్ 341 రకం రూ.16,500లకు రూ.15వేలు ధర పలికింది. అలాగే, దీపిక రూ.14వేలు పలికింది. దేశీ రకం రూ.34వేలకు రూ.30వేలు, తాలు రూ.8వేలకు రూ.8,500 ధర పలికింది.

అక్రమాలకు కేరాఫ్ కేయూ!

ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తన చదువులమ్మ చెట్టు నీడలో ఎందరినో మహానుభావులుగా తీర్చిదిద్దిన కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట దిగజారుతోంది. యూనివర్సిటీ నిర్వహణ వ్యవహారాల గురించి గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవటంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఫలితంగా అనేక అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. తాజా వెలుగులోకి వచ్చిన పలు అక్రమాలతో ఇదంతా వాస్తవమేనన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆన్సర్ షీట్ స్కానింగ్ టెండర్ల రద్దు, రీటెండర్ వ్యవహారం దుమారం రేపుతోంది. కాకతీయ యూనివర్సిటీలో 32పేజీలు ఉండే యూజీ, పీజీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను స్కానింగ్ చేయటం కోసం ఫిబ్రవరి 2వ తేదీన ఈ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. టెండర్ బిడ్ సమర్పించడానికి మార్చి6 వరకు గడువు విధించారు. ఇలా వచ్చిన దరఖాస్తుల టెక్నికల్ బిడ్‌ను మార్చి 7న, కమర్షియల్ బిడ్‌ను 13వ తేదీన ఓపెన్ చేయాల్సి ఉంది. ఈ స్కానింగ్ టెండర్‌కు మూడు కంపెనీలు బిడ్ దాఖలు చేయగా.. అందులో కోజిన్ లిమిటెడ్ కంపెనీ మిగతా రెండింటి కంటే తక్కువగా ఒక ఆన్సర్ షీట్ డిజిటలైజేషన్‌కు రూ.14.51కు కోట్‌చేసింది. నిబంధనల ప్రకారం టెండర్‌ను కోజిన్ కంపెనీకి ఇవ్వాల్సి ఉంది. కానీ, అనుహ్యంగా కేయూ వీసీ ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ ఈ నెల 16న రీటెండర్‌కు నోటిఫికేషన్ జారీ చేయటం వివాదాస్పదమైంది. పాత టెండర్‌ను ఎందుకు రద్దు చేశారో చెప్పకుండా రీ టెండర్ నోటిఫికేషన్ వేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన కంపెనీకి టెండర్ దక్కకపోవటంతోనే రద్దు నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం రూ.5లక్షల దాటే ఏ పనికైనా తప్పనిసరిగా టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో మూడేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా ఆన్సర్ షీట్ స్కానింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత టెండర్లపై దృష్టిపెట్టడంతో రూ.2కోట్లతో చేపట్టే ఆన్సర్ షీట్ల స్కానింగ్ పనులకు ఈసారి టెండర్లు పిలిచి, వాటిని ఆకారణంగా రద్దు చేసిన కేయూ అధికారుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ టెండర్ రద్దుపై పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదు చేయటం కలకలం రేపుతోంది.

అధ్యాపకుల నియామకంలో అక్రమాలే..

కేయూలో ఇటీవల నియమించిన అనుబంధ అధ్యాపకుల(అడ్జంట్ ఫ్యాకల్టీ)ను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం అడ్జంట్ ఫ్యాకల్టీ నియమకానికి ముందస్తుగా నోటిఫికేషన్ ఇవ్వాలని, వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధిపతులు పరిశీలించి రిజిస్ట్రార్‌కు పంపించాల్సి ఉంటుందని యూనివర్సిటీ అధ్యాపకులు పేర్కొంటున్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అధ్యాపకులను ఎంపిక చేసేందుకు ఐదుగురితో కూడిన సెలక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదనే విమర్శలున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12 మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16 మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 సెప్టెంబరులో ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో ఎలాంటి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకూడదని ఆదేశాలున్నా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకుండా నియామకాలు చేశారని, వీరి కి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మంది కి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయడం లేదని, క్లాసులు తీసుకోవటం లేదని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫామ్-డి అనుమతిలో నిబంధలు బేఖాతరు

ఫార్మసీ కాలేజీలకు అనుమతుల్లోనూ కేయూ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేయూ పరిధిలో మొత్తం 24 ఫార్మసీ కాలేజీలుండగా వీటిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులున్నాయి. అయితే 12కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్-డి కోర్సు నిర్వహించే కాలేజీలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన 300 పడకల ఆస్పత్రులు అనుబంధంగా ఉండాలి. కానీ దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో.. కేర్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ, వాగ్దేవీ హనుమకొండ, సెయింట్ పీటర్, తాళ్ల పద్మావతి కాలేజీ, ఖమ్మం ఫార్మసీకాలేజీలు మాత్రమే 300 పడకల ఆస్పత్రులను అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారు. కేయూ అధికారుల తమకు అనుకూలమైన వారిని తనఖీలకు పంపించి, తప్పుడు నివేదికల ఆధారంగా ఆ కళాశాలలకు అనుమతులిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలతో కేయూ పరువు బజారుకెక్కింది. 2017లో పీహెచ్‌డీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు ఆరేళ్ల పాటు పట్టించుకోలే దు. విద్యార్థుల ఆందోళనలతో దిగివచ్చిన కేయూ అధికారు లు 2023లో అడ్మిషన్లకు షెడ్యూల్ ప్రకటించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో 75శాతం రెగ్యులర్ ప్రాతిపదికన, 25శాతం పార్ట్ టైం ప్రాతిపదికన కేటాయించారు. మే 27, 2022లో కేటగిరి-1 ఇంటర్వ్యూలు నిర్వహించి.. అదే ఏడాది మార్చి 21న కేటగిరి-2లో సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టు 29న ఫలితాలు వెల్లడించారు. అయితే ఇంటర్వ్యూలో అధికారులు నిబంధనలు పాటించలేదని, అవకతవకలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తూ గత సెప్టెంబరులో ఆందోళనకు దిగా రు. కేటగిరి-2 అడ్మిషన్లలో కొందరు ప్రొఫెసర్లు సీట్లు అమ్ముకున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగగా పదిమంది విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేసి ఇద్దరిని జైలుకు పంపించారు. దీనిపై విద్యార్థులు అప్పటి గవర్నర్ తమిళిసైను కూడా కలిసి పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఫిబ్రవరి 16న త్రిసభ్య కమిటీని వేసింది. కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు ఆ త్రిసభ్య కమిటీ సభ్యులు కేయూలో పర్యటించి వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు అధ్యాపకులు, విభాగాల అధిపతులు, విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. అయితే గత బుధవారం త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా అందులో ఏముందో యూనివర్సిటీ అధికారులు బయట పెట్టకపోడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కాగా, వీటితో పాటు కేయూలో ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పరిశోధనలు చేయకుండా రూ.20లక్షల నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ జరుగుతోంది. రిజిస్ట్రార్, వీసీ నియామకాలతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలపై వివాదం కొనసాగుతుండగా.. ఇప్పటికే ప్రభుత్వం యూనివర్సిటీపై దృష్టిసారించి ప్రత్యేక విచారణ కమిటీలు, విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించింది. కేయూలో జరుగుతున్న అవతవకలపై అకుట్ ఆధ్వర్యంలో అనేకమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. మొత్తం మీద రాష్ట్రంలో రెండో అతిపెద్ద యూనివర్సిటీగా ఉన్న కేయూలో కొంతకాలంగా వస్తున్న అక్రమాల ఆరోపణలు, విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనలతో ప్రతిష్ట మసకబారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌లో గడువు తీరిన ఔషధాల విక్రయం

వరంగల్ మెడికల్, మార్చి 22: రోగికి గడువు తీరిన ఔషధాలు విక్రయించిన ఘటనపై వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని శ్రీ సృష్టి హాస్పిటల్ వైద్యురాలు దొడ్డ సంధ్య దగ్గరకు లలిత అనే గర్భిణీ పరీక్ష నిమిత్తం ఈ నెల 18న వెళ్లింది. వైద్యురాలు గర్భిణీకి పరీక్ష నిర్వహించి పోల్‌విస్ట్-డీహెచ్‌ఏ మా త్రలు రాసింది. ఇదే హాస్పిటల్ ఆవరణలోని తిరుమల ఫార్మసీలో మందులు కొనుగోలు చేశారు. ఎక్స్‌పైరీ తేదీ దగ్గర కట్ చేసి నాలుగు షీట్స్ విక్రయించారని రోగి భర్త ఎం.మహేశ్ ఫిర్యాదు చేశారు. వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మందుల విక్రయాలపై డీఎంఈ ఆరా

వరంగల్ మెడికల్, మార్చి 22: ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు మందులను ప్రయివేట్ వ్యక్తులకు విక్రయించిన ఘటనపై వైద్య విద్య డైరెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఆర్‌ఈహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్‌రెడ్డి సెలవులో ఉండటంతో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో శుక్రవారం ఉదయం డాక్టర్ చంద్రశేఖర్ ఆర్‌ఈహెచ్‌ను సందర్శించారు. మందులు బయటికి తరలివెళ్లిన విషయాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను డీఎంఈకి పంపనున్నారు. కాగా, ఎఫ్ఐఆర్ కాపీ అందించిన వెంటనే ఫార్మసిస్టు తలకోటి నాగేందర్‌ను సస్పెండ్ చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

ఏప్రిల్ 1 నుంచి దివ్యాంగుల ప్యాసింజర్ వాహనాల రాయితీ రద్దు

వరంగల్ చౌరస్తా, మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆదేశానుసారం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేయబడుతున్న టీ-ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ప్యాసింజర్ వాహనాలకు కల్పించే రాయితీ ఏప్రిల్ 1 నుంచి రద్దు చేయబడిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శుక్రవారం నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన రాయితీలు యథావిధిగా అమల్లో ఉంటాయన్నారు. రద్దు చేయబడిన లబ్ధిదారులు ఆ రాయితీని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పొందవచ్చని ఈ మార్పును లబ్ధిదారులు గమనించాలని నర్సింహమూర్తి తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, మార్చి22: గీసుగొండ మండలంలోని రెడ్డిపాలెం, హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్‌లో బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో రెడ్డిపాలెంలో రూ.61,210, ఎల్లాపూర్‌లో రూ.5100 అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధృవీకరించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డికి అర్చక ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి



సీఎంను కలిసి సమస్యలను నివేదిస్తున్న అర్చక ఉద్యోగుల జేఏసీ నాయకులు

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలన్నిటినీ పరిష్కరించాలని అర్చక ఉద్యోగుల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థించింది. శుక్రవారం అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో అర్చకులు సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసగృహంలో కలిశారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా జీవో నెంబరు 577 ప్రకారం అర్చక ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,627 మందికి వేతనాలు చెల్లించాల్సి ఉండగా, దేవాదాయ అధికారుల నిర్లక్ష్యంవల్ల ప్రస్తుతం మూడు వేల మందికి మాత్రమే వస్తున్నాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగతా వారికి కూడా వచ్చేట్టు తగిన చర్యలు తీసుకోవలసిందిగా వారు కోరారు. 121 జీవో తొలగించడంవల్ల పూర్తిస్థాయిలో అందరికీ గ్రాంట్ ఎయిడ్ ద్వారా వేతనాలు వస్తాయని తెలిపారు. రెండేళ్లుగా దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాలు లేవని తెలిపారు. 200మంది అర్చక ఉద్యోగుల పిల్లలను కారుణ్య నియామకాల ద్వారా నియమించాలని కోరారు. అర్చక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా అర్చక ఉద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రతీ అర్చక ఉద్యోగికి ఆరోగ్య బీమా వర్తింప చేయాలని సీఎంను అభ్యర్థించారు. రిటైరైన ఉద్యోగులకు రూ.10లక్షల చొప్పున గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, గ్రామీణప్రాంత ధూప, దీప, నైవేద్య అర్చకులకు ఉద్యోగభద్రత కల్పించాలని, వారి గౌరవ వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని, ధార్మిక భావన కలిగిన వారిని దేవాలయ ధర్మకర్తల మండలిలో నియమించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఓఎస్‌డీని పిలిచి అర్చక ఉద్యోగుల సమస్యలపై రెండు రోజుల్లో నివేదిక అందచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు క్రిష్ణమాచారి, పరాశరం రవీంద్రాచారి, అర్చక జేఏసీ కన్వీనర్ అగ్నిహోత్రం చంద్రశేఖర్ శర్మ, కర్మాఘాట్ దేవాలయం అర్చకులు అంబా ప్రసాద్ శర్మ, సంతోష్ కుమారాచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ కేయూ రోడ్డులోని గోపాల్‌రావు బిల్డింగ్ ఏరియాలో ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనదారుడు యూ టర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొని గాయపడ్డ ఘటన ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికాస్‌నగర్‌కు చెందిన ఎల్లస్వామి డబ్బాల నుంచి రెడ్డికాలనీ వైపు వస్తుండగా గోపాల్‌రావు బిల్డింగ్ వద్ద కారు డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడి ఎడమ కాలు విరిగింది. బాధితుడి అల్లుడు దండు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ధర్మసాగర్, మార్చి 22: అక్రమంగా మట్టిని రవాణాచేస్తున్న టిప్పర్లను ఎస్సై నర్సింగరావు శుక్రవారం పట్టుకున్నారు. నష్కల్‌కు చెందిన కొతుల రాజు, యాకయ్యలు ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ శివారు గట్టుమల్లికార్జున దేవస్థానం నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి వద్దకు రాగానే పోలీసులు వాహనాలను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను పీఎస్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రైల్వే కో ఆప్షన్ మెంబర్‌గా రాఘవేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాఘవేందర్

కాజీపేట, మార్చి 22: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అనుబంధంగా నడుస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ల సర్వసభ్య సమావేశం శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగింది. కాజీపేట రైల్వేవిభాగంలో పనిచేస్తున్న దేవులపల్లి రాఘవేందర్‌ను కో ఆప్షన్ డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్ర సంఘం నాయకుల చేతుల మీదుగా రాఘవేందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్‌రావు, పిల్లలమర్రి రవీందర్, షేక్ ఖాజాబాబ, చినుకు స్వామిలకు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



బాబోయ్.. ఎండలు!

● వడగాలులతో జాగ్రత్త ● వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం ● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

వరంగల్ మెడికల్, మార్చి 22: ఎండలు బాబోయ్ ఎండలు.. అంటూ జనం బేజారవుతున్నారు. మార్చి మొదటివారం నుంచే మండే ఎండలు ముంచుకొచ్చాయి. ఇక ఏప్రిల్, ఇక మే నెలను తలుచుకుంటే జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది ఎండలు దంచనున్నాయని ముందే హెచ్చరించింది. కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు భానుడి ప్రతాపానికి విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఇప్పటికే మంచాన పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి తమను తాము రక్షించుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వర్గాలు చెబుతున్నాయి.

వడదెబ్బ ఎలా సోకుతుంది?

ఎండ తీవ్ర ఉన్నప్పుడు మనిషి మెదడులో ఉన్న ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల, ఎక్కువసేపు ఎండలో ప్రయాణం చేసిన పని చేసిన వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత 108 ఫారన్‌హీట్ నుంచి 110 ఫారన్‌హీట్‌ల వరకు పెరుగుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

వడదెబ్బ లక్షణాలు

శరీరం నీరసించి పోవడం, విపరీతమైన దాహం, మూత్ర విసర్జనలో మంట తీవ్ర, చర్మం ఎర్రగా మారి వేడిగా ఉండడం, నీళ్ల విరేచనాలు, తల తిరగడం, మగతగా ఉండి అపస్మారక స్థితికి చేరడం. వాంతులు చేసుకోవడం.

వెంటనే అందించాల్సినవి

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ లేదా గాలి ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఆ తరువాత శరీరంపై ఉన్న దుస్తులు తొలగించి ఐస్ ముక్కలతో చల్లని నీటితో కానీ శరీరం అంతా తుడవాలి. కొబ్బరినీరు, నిమ్మరసం, మజ్జిగ ద్రావణాన్ని తొలగించాలి. అయినా రోగి కోలుకోకపోతే వెంటనే ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు.



ముందస్తు చర్యలు చేపట్టాం..

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు



ఎండలు ముదురుతున్న దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, ఆరోగ్య ఉప కేంద్రాల, తన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని అలర్ట్ చేశాం. క్షేత్రస్థాయిలో వడదెబ్బ సోకిన వారి వివరాలు సేకరించేందుకు యంత్రాంగం పూర్తి కార్యాచరణతో ఉంది. పిల్లలు, వృద్ధులు తొందరగా వడదెబ్బ సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్య శాఖ కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెలైన్ బాటిల్స్ సరిపడా నిల్వలు ఉన్నాయి. త్వరలో ప్రత్యేక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తాం. 108, 104 సేవలు కూడా ముమ్మరం చేస్తాం, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

వైభవంగా తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు


దేవాలయంలో ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 22: స్టేషన్ ఘన్‌పూర్‌లోని పురాతన తిరుమలనాథ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 6వ రోజు స్వామి వారికి నిత్య హోమం, ధ్వజారోహనం, గరుడాధివాసం, భేరీపూజ, గరుడముద్దలు వేయుట, హోమం, బలిహరణం, లక్ష్మీనారాయణ ఇష్టి, హనుమంత వాహనంపై తిరు వీధి సేవ, విష్ణు సహస్రనామ పారాయణం, ఎదుర్కోళ్లు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా, 23న ఉదయం 11 గంటలకు స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి చెప్పారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు కె.సతీష్, ధర్మకర్తలు గన్ను శ్రీనివాస్, యాదశ్రీను, తెల్లాకుల రామకృష్ణ, గోలిశ్రీను, నరేందర్, ఎం.రవీందర్, ఎస్.ఆంజనేయులు, జగన్‌రెడ్డి, ఎం.విజయ్‌కుమార్, పూజారులు కందాళై శ్రీనివాసాచార్యులు, అప్పలాచార్యులు, రఘునాథాచార్యులు, రాము, శేషాచారి, నరేష్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.50వేలు అందజేత

జనగామ కల్చరల్, మార్చి 22: మిత్రమా... నిను మరువబోము... అంటూ చిన్ననాటి స్నేహితులు అతని కుటుంబానికి అండగా నిలబడ్డారు. మండలంలోని ఓబుల్ కేశ్వాపురం గ్రామానికి చెందిన ముక్క బాలనర్సయ్య అనే వ్యక్తి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. స్నేహితులైన బచ్చన్నపేట జడ్పీ హైస్కూల్ 1984-85 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అతని కుటుంబానికి అండగా నిలవాలనుకున్నారు. మిత్రులందరూ పోగు చేసుకొని రూ.50 వేలు బాలనర్సయ్య కూతురు సాహితి పేరున పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆబాండ్‌ను ఓబుల్‌కేశ్వాపురం వెళ్లి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు బొమ్మెన రాజు, యాదన్న, రవిచంద్ర, వేణు, పృథ్వీరాజ్, రాజమౌళి, మురళి, వెంకటేష్, బల్లెపు యాదగిరి, సుధాకర్‌రెడ్డి, శ్రీను, మహేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం


సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధేశ్వర్

జనగామ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీదే ఘన విజయమని రాజీవ్‌గాంధీ పంచాయత్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ దుర్మార్గ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పుచేసి ప్రజలపై భారం మోపారన్నారు. పంచాయతీలకు రావాల్సిన డబ్బులను ఇవ్వకుండా సర్పంచులపై ఆర్థిక భారం మోపారని విమర్శించారు. దీని వల్ల రాష్ట్రంలో కొందరు సర్పంచులు ఆస్తులు అమ్ముకున్నారని, కొంతమంది భార్యల పుస్తెలు తాకట్టు పెట్టారని తెలిపారు. పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ప్రయోజనాలే ముఖ్యం : కాంగ్రెస్

పాలకుర్తి, మార్చి 22 : వ్యక్తి కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, దేవరుప్పుల మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరుప్పల మండలంలో కాంగ్రెస్ పార్టీలో కొంత మంది గొడవలు చేయడం మంచిది కాదన్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాకుండా అధిష్టానం నిర్ణయం మేరకు పని చేస్తున్నారని అన్నారు. దేవరుప్పల మండలంలోని 28 గ్రామాల కాంగ్రెస్ గ్రామ కమిటీల తీర్మానం మేరకు శ్రీరాంను నియమించారని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, గంగు కృష్ణమూర్తి, జల్లం కుమార్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, భార్గవ్, హరీశ్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో డీఎస్ వెంకన్న



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీఎల్‌వోలు

ఆర్డీవో డీఎస్ వెంకన్న

జఫర్‌గడ్, మార్చి 22 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న ఓటర్లను కోరారు. శుక్రవారం జఫర్‌గడ్‌లో ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్‌లో ప్రజలనుద్దేశించి ఆర్డీవో వెంకన్న మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఓటరు బాధ్యతగా ఓటు వేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందన్నారు. ఓటుహక్కుపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతం కావాలన్నారు. ఓటు అవగాహన ర్యాలీలో గ్రామైక్యసంఘాల అధ్యక్షులు, మహిళలు పాల్గొనకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆయన సంబంధిత ఐకేపీ ఏపీఎం సురేందర్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్ఐ శీలం రవి యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, కార్యదర్శి బోనగిరి రాజేశ్వర్‌రావు, బీఎల్‌వో వివేక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు,అధికారులు పాల్గొన్నారు.

● తరిగొప్పుల : 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ బీఎల్‌వోల వద్ద ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిష్టయ్య అన్నారు. తరిగొప్పుల మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, అధికారులు ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రాథమికోన్నత పాఠశాల వరకు ర్యాలీ చేపట్టి ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఆర్ఐ గుజ్జ రవీందర్, పంచాయతీ కార్యదర్శి బండి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ దాని విలువ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అంజయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం బూత్ స్థాయిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతీ ఓటరు తన బాధ్యతగా భావించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజలకు ఓటుహక్కు వినియోగం, 18 ఏళ్లు నిండిన ప్రతీ యువతి, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ బీఎల్‌వోలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించగా తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఎలక్షన్ డీటీ రాజేష్‌కుమార్, ఆర్ఐలు అర్జున్, రవీందర్, సీడీపీవో ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు పలువురి పరామర్శ

▸▸ ఆహార, నీటి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిన డీఎంహెచ్‌వో


ఆస్పత్రిలో విద్యార్థినుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

జనగామ కల్చరల్, మార్చి 22: మండలంలోని పెంబర్తి సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం పలువురు సందర్శించారు. ఈ నెల 21న కొంత మంది గురుకుల బాలికలు ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులను డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఏసీపీ దామోదర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్, భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించి మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని సిబ్బందిని హెచ్చరించారు. ఫుడ్, వాటర్ శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. మిగిలిన విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా హాస్టల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

పెంబర్తి గురుకుల బాలికల పాఠశాలలో బాలికల అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఈ సంఘటనకు హాస్టల్ వార్డెన్‌తో పాటు ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని మండిపడ్డారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ యజమాని లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

బాలికలను పరామర్శించిన కాంగ్రెస్ నేత

జనగామ(ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన గురుకుల పాఠశాల విద్యార్థినులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను, వారి తల్లిదండ్రులు, వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఘనంగా పొట్లపల్లి జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే శ్రీహరి సమక్షంలో కేక్ కట్ చేస్తున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిలుపూర్, మార్చి 22: మండలంలోని పల్లగుట్టలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, చిలుపూర్ ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరు కాగా, వివిధ మండలాల నాయకుల సమక్షంలో శ్రీధర్‌రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ అనతికాలంలోనే బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం చర్యలు చేపట్టడం, చిలుపూర్ ఆలయ అభివృద్ధికి శ్రీధర్‌రావు స్వచ్ఛందంగా పాటుపడడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, రత్నాకర్‌రెడ్డి, పేరాల సుధాకర్, బొట్టు చేరాలు, జీడి ఆనందం, మామిడాల లింగారెడ్డి, జనగామ యాదగిరి, తాళ్లపల్లి సమ్మయ్య, భూక్య రమేష్, తాళ్లపల్లి సంపత్, గడ్డమీది వెంకటస్వామి, గన్ను నర్సింహులు, ఇసురం కృష్ణ, ఐలపాక మనోజ్, గుర్రం యాదగిరి, రమేష్, భూక్య సంజీవ, వెంకటేశ్, బి.రాజన్‌బాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 22 : స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన సాంబారి శ్రీనివాస్ ఇటీవల రైలులో నుంచి జారిపడి రెండు కాళ్లు కోల్పోవడంతో ఆ కుటుంబానికి అండగా ఉంటామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఇమ్మాన్యూయల్ రాజు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.5వేలు అందించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందిర ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సింగపురం దయాకర్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చింత జోత్స్న, వడ్లూరి మౌనిక, నారగోని పద్మ, గట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కావ్యను కలిసిన బీఆర్ఎస్ నేతలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 22: బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన కడియం కావ్యను శుక్రవారం ఆ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆమె నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఇమ్మడి హరిప్రసాద్, భూర్ల శంకర్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కావ్య గెలుపు తథ్యమన్నారు. కావ్య భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమైపోయిందన్నారు. కార్యక్రమంలో నవీన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచాలి

▸▸ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్


చిన్నరామన్‌చర్ల శివారులోని ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న నాయకులు

బచ్చన్నపేట, మార్చి 22: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూములను ఇళ్లు లేని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. భూములను కబ్జా చేసిన వారిపై కేసులు సైతం నమోదు చేయాలన్నారు. బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారు పరిధిలోని 174 సర్వే నంబర్‌కు సంబంధించిన భూమిని రెవెన్యూ, కోర్టులను తప్పుదోవ పట్టించి స్టేటస్‌కో ఆర్డర్‌లు పొందిన గిరబోయిన అంజయ్యపై కేసులు నమోదు చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన భూమిని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరాములుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం గుడిసెలు వేసుకున్న పేదలనుద్దేశించి వెంకట్ మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో నమోదైన కేసులు ఎత్తివేస్తామని చెబుతూనే గుడిసెలు వేసుకున్న పేదలపై, సీపీఎం నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నా పాలకులకు పట్టింపు లేదని, పేదలు గుడిసెలు వేసుకుంటే తొలగించడమేమిటని ఆయన ప్రశ్నించారు. 174 సర్వే నంబర్ గుడిసెవాసుల పోరాటానికి పెద్ద ఎత్తున మద్దతు కూడగట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి తిరుకల్యాణోత్సవం

▸▸ పట్టు వస్త్రాలు సమర్పించిన దేవాదాయ శాఖ ఏసీ

▸▸ గోవిందనామ స్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు


స్వామి వారి తిరుకల్యాణాన్ని జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, మార్చి 22: మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ఈసారి సార్వత్రిక ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో ప్రజాప్రతినిధులకు బదులుగా దేవాదాయ శాఖ అధికారులే కల్యాణ తంతును ముగించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్ కుమార్ నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలతో పాటు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను గుట్ట దిగువన ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు పల్లకిలో తీసుకెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తుల సమక్షంలో పూజారులు రవిందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల మధ్య కల్యాణతంతును ఘనంగా పూర్తి చేశారు. వేడుకలకు హాజరైన భక్తులకు స్వామి వారి అర్చన అభిషేకంతో పాటు శేషవస్త్రాలను అందించి ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా రవిందర్ శర్మ మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందిన కుటుంబాలు సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో వెలుగొందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సింగపురం ఇమ్మాన్యుయేల్‌రాజ్ హాజరు కాగా, పూజారులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మాజీ చైర్మన్ మూల నాగరాజు, తీగల మహేందర్, గడ్డమీది సురేశ్, ధర్మకర్తలు సంగోజు మోహన్, గట్టు ఎల్లయ్య, జక్కుల రాజశేఖర్, గాజుల రజిని, పుట్ట కిరణ్‌రెడ్డి, నాయకులు మామిడాల లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, జనగామ యాదగిరి, తోట సత్యం, గుర్రం రాజు, ఏడవెళ్లి విజయ, తాళ్లపల్లి సమ్మయ్య, జీడి ఆనందం, పుల్యాల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

రఘునాథపల్లి, మార్చి 22 : విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులు ఇష్టంతో చదివి అత్యుత్తమ స్థాయికి ఎదగాలని సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ సునీత అధ్యక్షత శుక్రవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అశోక్ హాజరై మాట్లాడారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాత్కాలిక సమస్యల కోసం శాశ్వతమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సహజ, కృష్ణమూర్తి, బాలరాజు, పరమేశ్వర్, కేజీబీవీ ఉపాధ్యాయులు ప్రభ, స్వప్న, రాజ్యలక్ష్మి, దేవి, శ్రీలత, వినోద తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు

జనగామ కల్చరల్, మార్చి 22: జనగామ జిల్లా కేంద్రంలోని ఎంపీపీఎస్ హరిజన కాలనీలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం పాఠశాల హెచ్ఎం నీర్మాల రాములు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఈ కమిటీ ఎన్నికైంది. కన్వీనర్‌గా హెచ్ఎం వ్యవహరించనుండగా, చైర్ పర్సన్‌గా చింతకింది అరుణతో పాటు తరగతికి ముగ్గురు మహిళల చొప్పున 15 మంది ఈ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులందరూ పాలుపంచుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరాని కల్లా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అలాగే వెంకిర్యాలలో ఆదర్శ పాఠశాల కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా హెచ్ఎం దూడల రమేష్, చైర్ పర్సన్‌గా గర్దాసు లక్ష్మీతో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్ల లలిత, బక్క విద్యారాణి, వలబోజు స్రవంతి, జగదాంబ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


నర్మెటలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డీడబ్ల్యువో జయంతి

నర్మెట, మార్చి 22 : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని డీడబ్ల్యువో జయంతి అన్నారు. పోషణ పక్వాడ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నర్మెటలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం డీడబ్ల్యువో జయంతి గర్భిణులకు, బాలింతలకు, పిల్లల తల్లులకు, కిశోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. శిశువు పుట్టగానే ముర్రుపాలు పట్టిస్తే పోషకాలు అందుతాయన్నారు. శిశువుకు ఆరు నెలల వరకు తల్లి పాలనే పట్టించాలన్నారు. తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించాలని తెలిపారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా చిరుధాన్యాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజామొహినొద్దీన్, సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ సునితాదేవి, అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తహేరా బేగం అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ ఒకటో కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహేరాబేగం మాట్లాడారు. బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ గీత, సుజాత, యాకలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారం, న్యూట్రిషన్ కిట్స్‌ను విధిగా తీసుకోవాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో పోషణ పక్షంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఐసీడీఎస్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించగా, వారికి వివిధ రకాల వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారంతో పాటు చిరు ధాన్యాలను తీసుకోవాలని సూచించారు. రక్తహీనత సమస్య తలెత్తకుండా మహిళలు చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఫ్లోరెన్స్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సంధ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

నర్మెట, మార్చి 22 : నర్మెట మండల కేంద్రంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను మండల కుమ్మర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం మండల అధ్యక్షుడు కొన్నె తిరుపతి, రాష్ట్ర నాయకులు కొన్నె సిద్దులు, రాయరపు ఉపేందర్, నాయకులు చంద్రయ్య, వెంకటయ్య, గుడికందుల నరహరి, ప్రసాద్, సాయిలు, ఆగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లింగాలఘణపురం, మార్చి 22: మండలంలోని నెల్లుట్ల వద్ద జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సెంట్రింగ్ కార్మికులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన ప్రకారం... జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన శానబోయిన కుమార్, బండ యాకయ్య అనే కార్మికులు ద్విచక్ర వాహనంపై జనగామ నుంచి వడ్డిచర్లకు వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వెళ్తున్న చెరుకు రసం మిషన్ బండి అకస్మాత్తుగా యూటర్న్ తీసుకునే క్రమంలో రెండు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కుమార్ తీవ్రంగా, యాకయ్య స్వల్పంగా గాయపడ్డాడు. కాగా, అదే దారిలో వెళ్తున్న అనస్తీషియ డాక్టర్ శశిధర్ బాధితులకు ప్రాథమిక చికిత్స నిర్వహించి 108 ద్వారా ఆస్పత్రికి తరలించేందుకు సాయం చేశారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

▸▸ డాక్టర్ పరంవీర్‌సింగ్ ▸▸ ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం


రాజవరంలో మాట్లాడుతున్న డాక్టర్ పరంవీర్ సింగ్

చిలుపూర్, మార్చి 22 : ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని డాక్టర్ పరంవీర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రాజవరంలో నీటి వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే నీటి కొరత ఏర్పడుతోందని తెలిపారు. ప్రజలు తమ తమ ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.హైమావతి, ఏఎన్ఎం కె.సంతోష, కారోబార్ గూడూరు భాస్కర్, రాజు, మధు, ఆశా కార్యకర్తలు విజయ, పద్మ, రేణుక పాల్గొన్నారు.

నీటి కాలుష్యాన్ని నివారించాలి

రఘునాథపల్లి: ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన నీటిని వాడి నీటి కాలుష్యాన్ని నివారించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కమలహాసన్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటి వినియోగంతో చేకూరే ప్రయోజనాలపై ప్రజలకు వైద్య సిబ్బంది సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో ఈ నెల 27 వరకు స్వచ్ఛమైన నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బిక్కునాయక్, ఝాన్సీరాణి, సులోచన, విష్ణువర్ధన్ రెడ్డి, పాండరి తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుతోనే మానవాళి మనుగడ

స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రతి ఒక్కరూ నీటి వాడకాన్ని పొదుపు చేస్తేనే భవిష్యత్‌లో మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఇప్పగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఇంజుమామ్‌అలీ తెలిపారు. ప్రపంచ నీటిదినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 'నీటిని పొదుపు చేద్దాం.. మానవళి మనుగడకు బాటలు పరుద్దాం' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీపీ కార్యాలయం ఎదుట నీటిని దుర్వినియోగం చేయడం వలన కలిగే అనర్థాలపై వైద్య బృందం గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ జీవికి నీరే మూలాధారం అని, నీటిని పొదుపుగా వాడడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ రమణ, హెచ్‌వీ పర్వీన్ సుల్తాన్, ఏఎన్ఎంలు సునీత, లత, రేఖ, ఆశాలు సునీత, రమ తదితరులు పాల్గొన్నారు.